రక్షణ ఇవ్వని తుఫాన్ షెల్టర్లు





కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా ఉన్న ముత్యాలపట్టుపాళెం, సీఎస్‌పురం తుఫాన్ షెల్టర్లు

- అలంకారప్రాయంగా మారిన భవనాలు
- సమస్యల్లో తీరప్రాంత వాసులు

తోటపల్లిగూడూరు : భారీ వర్షాలు, తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణతో పాటు ఆసరా కల్పించేందుకు పాలకులు నిర్మించిన తుఫాన్ షెల్టర్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ఇవి ప్రజలకు ఉపయోగంలో లేక అలంకారప్రాయంగా మారుతున్నాయి. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కోడూరు, వెంకన్నపాళెం, మండపం, ఈదూరు, మల్లికార్జునపురం గ్రామాల్లో 18 తుఫాన్ షెల్టర్లున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలం సీజన్ అయిన అక్టోబర్, నవంబర్ మాసాల్లో స్థానికులు ఈ తుఫాన్ షెల్టర్లను వినియోగించుకొంటుంటారు.

కానరాని కనీస సౌకర్యాలు

తీరప్రాంత వాసులకు ఆవాసం కల్పించాల్సిన తుఫాన్ షెల్టర్లలో కనీస సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వెంకన్నపాళెం పంచాయతీలోని పట్టపుపాళెం, కోడూరు పంచాయతీలోని ముత్యాలతోపు, పాత పట్టపుపాళెం, కొత్తపట్టపుపాళెం, ఎద్దలరేవుసంఘం, రవీంద్రపట్టపుపాళెం, నడింపట్టపుపాళెం, మండపం పంచాయతీలోని ఈదూరు పట్టపుపాళెం గ్రామాల వాసులు భారీ వర్షాలు, తుఫాన్ల సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయాల్లో అధిక శాతం స్థానికులు గ్రామాలను వదిలి తుఫాన్ షెల్టర్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. అయితే మండలంలో ఉన్న ఏ తుఫాన్ షెల్టర్‌లోనూ విద్యుత్ సౌకర్యం గానీ, తాగునీటి వసతి గానీ లేదు. దీంతో స్థానికులు చీకటి గదుల్లో, దాహంతో విలవిల్లాడాల్సిన పరిస్థితి ఉంటుంది. అంతేకాక షెల్టర్లలో ఉన్న అధికశాతం గదులకు తలుపులు, కిటికీలు లేవు. దీంతో షెల్టర్లలో పూర్తిగా రక్షణ లేకుండా పోతోంది. అధికారుల పర్యవేక్షణ లేనందున చాలా తుఫాన్ షెల్టర్లు అస్తవ్యస్తంగా తయారై బూత్ బంగళాల మాదిరిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో తుఫాన్ షెల్టర్‌ను కూడా స్థానికులు సక్రమంగా వినియోగించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం వర్షాకాల సీజన్ మొదలైన నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి తుఫాన్ షెల్టర్లలో కనీస సౌకర్యాలు, వసతులను సమకూర్చాల్సిన అవసరం ఉంది.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



తుఫాన్ షెల్టర్లను నిర్మించిన పాలకులు వాటిలో కనీస వసతులను కల్పించలేదు. ప్రకృతి విపత్తుల సమయాల్లో షెల్టర్లలోకి వెళ్లేందుకు ఇష్టం చూపలేకపోతున్నాం. అందుకే కష్టమైనా, భయమైనా ఇళ్లలోనే తలదాచుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి తుఫాన్ షెల్టర్లలో కనీస మౌలిక సౌకర్యాలను కల్పించాలి.

– సుధాకర్, తీర ప్రాంతం, ముత్యాలతోపు పట్టపుపాళెం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

మండలంలోని తుఫాన్ షెల్టర్ల మరమ్మతులు, కావాల్సిన వసతులకు సంబంధించిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి నిధులు విడుదల కాగానే తుఫాన్ షెల్టర్లలో మౌలిక వసతులను సమకూరుస్తాం. వినియోగంలోకి తీసుకొస్తాం.

– రమేష్, పీఆర్ ఏఈ, తోటపల్లిగూడూరు.

క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

విత్తన శుద్ధి ముఖ్యం



బీజామృతం తయారీ విధానాన్ని చూపిస్తున్న అధికారులు

ముత్తుకూరు : వ్యవసాయంలో విత్తన శుద్ధి చాలా ముఖ్యమని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం నారికేళపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వరి, వేరుశనగ పంటలకు సంబంధించి ట్రైకోడెర్మావిరిడి, సుడోమోనాస్‌వంటి జీవ శిలీంద్ర నాశనులతో విత్తన శుద్ధి చేయాలన్నారు. దీని వల్ల విత్తనం నాటినప్పటి నుంచి 30 రోజుల వరకు తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచాలి



ఉపాధ్యాయులతో కలిసి మొక్క నాటుతున్న ఎంఈఓ

బుచ్చిరెడ్డిపాళెం : ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను పెంచాలని ఎంఈఓ పాతపాటి వెంకటరత్నం అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలోని మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఆయన ఉపాధ్యాయులతో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూడ్స్‌లో అన్నదానం

వెంకటాచలం : మండల కేంద్రంలోని సెయింట్ జ్యూడ్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో గురువారం నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళేనికి చెందిన సురేంద్రరెడ్డి, ప్రసూనమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సురేంద్రరెడ్డి, ప్రసూనమ్మ దంపతుల కుమారుడు సుమంత్‌రెడ్డి అమెరికాలో ఉంటున్నాడు. అతని జన్మదినం రోజున ప్రతిఏటా మానసిక దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం చేస్తున్నారు. అందులో భాగంగా మానసిక దివ్యాంగులకు కాస్మోటిక్ వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం వారి చేత కేక్ కట్ చేయించి మానసిక దివ్యాంగులతో పాటుగా కసుమూరులో పేదలకు అన్నదానం చేశారు.

కంటైనర్ టెర్మినల్‌పై 15న సదస్సు



కరపత్రాల విడుదల

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను సాధించేందుకు ఈనెల 15వ తేదీన స్థానిక షాదీమంజిల్‌లో సదస్సు జరుగుతుందని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.హర్ష వెల్లడించారు. స్థానిక శ్రామిక భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. తొలుత సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కంటైనర్ టెర్మినల్ మూతపడడం వల్ల వ్యాపార రంగం కుదేలైందన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే అడుగేయలేం



మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

కొడవలూరు : చిన్నపాటి వర్షం కురిసినా ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. కొడవలూరులోని ప్రభుత్వ కార్యాలయాలు మెయిన్ రోడ్డుకు పక్కనే ఒకే వరుసలో ఉంటాయి. అయితే ఇవి రోడ్డు కంటే బాగా పల్లంలో ఉంటోంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయాల ప్రాంగణంలో వర్షపునీరు నిలిచిపోతున్నాయి. ఫలితంగా వివిధ అవసరాలపై కార్యాలయాలకు వచ్చేవారు వర్షపు నీటిలో రావల్సి వస్తోంది. ఒకే ప్రాంగణంలో ఎంపీడీఓ, ఎంఈఓ, వ్యవసాయ శాఖ, భవిత కేంద్రాలున్నాయి. మరో ప్రాంగణంలో వెలుగు, హౌసింగ్, ఉపాధిహామీ, పీహెచ్‌సీలున్నాయి. ఇవన్నీ కూడా పల్లంలోనే ఉండడం వల్ల చిన్నపాటి వర్షానికి కూడా మడుగుల్లా మారుతున్నాయి. ఒకవేళ ఎడతెరపి లేకుండా రెండ్రోజుల పాటు వర్షం కురిస్తే కార్యాలయాలు పూర్తిగా వర్షపు నీటిలో ఉండిపోతున్నాయి. అధికారులు సైతం మోకాళ్లోతు నీటిలో కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి ప్రాంగణాల్లో మట్టితో ఎత్తు చేసి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.



వెలుగు కార్యాలయ ప్రాంగణంలో..

పారిశ్రామిక దిగ్గజానికి నివాళి



మర్రి ఆకుపై రతన్‌టాటా చిత్రం

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం గురువారం మర్రి ఆకుపై రతన్ టాటా చిత్రాన్ని రూపొందించారు. భారతదేశంలో ఇండస్ట్రియల్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన పారిశ్రామిక దిగ్గజానికి ఈ చిత్రం ద్వారా నివాళులర్పించారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీహరి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని నాగమాంబపురం సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీహరి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోడల్ వసతి గృహాలుగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ ఆనంద్

పొదలకూరు : మహ్మదాపురంలో దొడ్ల కుటుంబం దాతృత్వంతో రూపుదిద్దుకుంటున్న విద్యాలయం, వసతి గృహాలను జిల్లాలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతామని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మండలంలోని దొడ్ల శంకరమ్మ బీసీ బాలుర వసతి గృహాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహ ప్రాంగణంలో ఈస్ట్ బ్లాక్ భవనాలను దొడ్ల శేషారెడ్డి రూ.2.50 కోట్లతో నిర్మించడం మంచిపరిణామమంగా పేర్కొన్నారు. ఇక్కడ హాస్టల్ భవనాలు ఎంతో చక్కగా ఉన్నాయన్నారు. మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు ల్యాబ్, క్రీడా ప్రాంగణం, ఇతర పరికరాలను అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామస్తులు సైతం ఇలాంటి గొప్ప కార్యక్రమానికి తమవంతు సహకారం అందివ్వాల్సిందిగా పిలుపునిచ్చారు. ముందుగా దాత దొడ్ల శేషారెడ్డితో కలిసి భవనాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన్న, ఇన్‌చార్జి హెచ్‌ఎం సునీత, మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్ గడ్డం తిరుపాల్ రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, అడపాల సుధాకర్‌రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



హాస్టల్ భవనాల వద్ద దొడ్ల శేషారెడ్డితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఆదాయ మార్గాలను అన్వేషించాలి

మనుబోలు : పంచాయతీలు ఆదాయాన్ని వృద్ధి చేసుకునే మార్గాలను అన్వేషించాలని ఎంపీడీఓ జలజాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యదర్శులకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె హాజరై, వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా గ్రామాల్లో పోగుపడే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ చెత్తతో కంపోస్టు ఎరువును తయారు చేసి దానిని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీలు గరుడయ్య, దీపిక, సుమన, చెంచుప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ జలజాక్షి

ఇసుక యార్డులో కలెక్టర్ తనిఖీ

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం ఇసుక డంపింగ్ యార్డును కలెక్టర్ ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఇసుక రవాణాకు వచ్చిన టిప్పర్ డ్రైవర్లతో కలెక్టర్ మాట్లాడి క్షేత్రస్థాయిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. లోడింగ్ సమస్యలు ఉన్నాయా.. ఎంత సమయం పడుతుందో ఆరాతీశారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుకను అందజేయాల్సిందిగా ఆదేశించారు. ఇసుక యార్డులో నిల్వలను అక్కడి ఉద్యోగుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారు 2 వేల మెట్రిక్ టన్నుల పైబడి ఉందని వెల్లడించారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో..

పొదలకూరు ఎక్సైజ్ స్టేషన్‌ను కలెక్టర్ ఆనంద్ తనిఖీ చేశారు. మద్యం లైసెన్సుల దరఖాస్తు ప్రక్రియను సీఐ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో 17 మద్యం దుకాణాలను కేటాయించారని, 320 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ వెల్లడించారు. నిబంధనల ప్రకారం మాత్రమే దరఖాస్తులను స్వీకరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.



ఇసుక యార్డు వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

గృహాలను పూర్తి చేయకుంటే రద్దే

కొడవలూరు : 2019–24 సంవత్సరాల మధ్య పక్కా గృహాలు మంజూరైన వారు వచ్చే మార్చి ఆఖరులోగా విధిగా పూర్తి చేసుకోవాలని, లేకుంటే రద్దు అవుతుందని హౌసింగ్ ఏఈ ఎస్కే.ముక్తార్‌బాషా అన్నారు. కొడవలూరులోని శివాలయం వెనుకనున్న ప్రభుత్వ లేఅవుట్‌ను గురువారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పూర్తి కాని గృహాల్లో అత్యధిక శాతం గిరిజనుల గృహాలే ఉన్నాయన్నారు. ఇప్పటివరకు అసలు గృహ నిర్మాణం ప్రారంభించకపోతే రద్దు చేసి మరో పథకంలో మంజూరు చేస్తారని తెలిపారు. పునాదులు వేసి ఒక దశ బిల్లు పొంది ఉంటే వారు తప్పనిసరిగా గృహ నిర్మాణం పూర్తి చేసుకోవాల్సిందేనన్నారు. లేకుంటే రద్దు చేస్తామని, ఇలా రద్దయిన వారికి మరో 20 ఏళ్ల వరకు మళ్లీ ఏ పథకంలోనూ పక్కా గృహం మంజూరయ్యే అవకాశం లేదన్నారు. ఇప్పటికే వివిధ దశలో నిర్మాణాలు చేసుకుని బిల్లులు పొంది ఉన్న వారు విధిగా పూర్తి చేసుకోవడం తప్ప మరో మార్గం లేదన్నారు. కొందరు లబ్ధిదారులు గృహం రద్దయితే కొత్తగా మంజూరు చేసే పథకంలో మళ్లీ రూ.3.50 లక్షల మంజూరు చేయించుకోవచ్చని భావిస్తున్నారని, కానీ నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి మరో గృహం మంజూరు చేయడం కుదరదన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, స్థానిక నేత పి.శ్రీనివాసులు ఉన్నారు.



కొడవలూరు లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ ముక్తార్‌బాషా

జయహే.. దుర్గాదేవి

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కామాక్షితాయిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బుచ్చి పట్టణంలో..

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో స్వామివారు త్రివిక్రమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

అంకమ్మతల్లి ఆలయంలో..

విడవలూరు : విడవలూరు గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో ద ర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు కొర్నా గిరి అమ్మవారికి అభిషేకాలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పల్లకిసేవ జరిగింది. మడపర్తి రవీ ంద్ర, జ్యోతి, దువ్వూరు వెంకటశేషారెడ్డి, అనితమ్మ, మైరా రామరాఘవరెడ్డి, అపర్ణమ్మ, మోడెం సుబ్రహ్మణ్యంరెడ్డి, కవిత ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గంగపట్నంలో..

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గంగపట్నం నాగేశ్వరరావు– శిరీష దంపతులు వ్యవహరించారు.

- పల్లిపాడులోని మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను కటాక్షించారు. ఉభయదాతలుగా చింతపంటి సుబ్రహ్మణ్యం– కృష్ణమ్మ దంపతులు వ్యవహరించారు.
- మైపాడు శివాలయంలో అమ్మవారికి కుంకుమార్చన, పల్లకిసేవ జరిగింది. స్థానికులు మర్రి గిరిబాబు– సురేఖ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. గ్రంథాలయం సెంటర్‌లోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో..

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తన్నీరు చినమస్తానయ్య, సుబ్రహ్మణ్యం బ్రదర్స్ వ్యవహరించారు. ఉదయం లలిత సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి కార్యక్రమాలను నిర్వహించారు.

రాజ్యలక్ష్మిగా అమ్మవారి దర్శనం

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజ్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

దుర్గాదేవిగా కాంతమ్మ

మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న ఆదిపరాశక్తి శ్రీకాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డిస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దసరా చావిళ్లలో..

మనుబోలు : మనుబోలులోని దసరా చావిళ్లలలో అమ్మవారు మహిషాసురమర్దిని, దుర్గాదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంశర్మ, సాయికుమార్ శర్మ అమ్మవారికి అలంకారాలు చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా వేలూరు భాస్కర్‌రెడ్డి– భారతమ్మ, సాలాపక్షి సుబ్రహ్మణ్యం– సురేఖ దంపతులు వ్యవహరించారు. అలాగే మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో జెండా మహోత్సవాన్ని నిర్వహించారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : దుర్గాదేవి అలంకారంలో కామాక్షితాయి



బుచ్చిరెడ్డిపాళెం : కోదండరామస్వామి ఆలయంలో..



పొదలకూరు : దుర్గాదేవి అలంకారం



మనుబోలు: మహిషాసురమర్దినిగా..



మనుబోలు: దుర్గాదేవి అలంకారం



విడవలూరు మండల కేంద్రంలో..